క్లుప్తంగా

నేడు, రేపు ఆధార్ శిబిరాలు

కాకినాడ: కాకినాడలోని పది ప్రాంతాల్లో సోమ, మంగళవారాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్టు కార్పొరేషన్ కమిషనర్ (ఎఫ్ఏసీ) సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. ఆధార్‌లోని మార్పులు, చేర్పుల కోసం ఈ ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పాత తూర్పుగోదావరి జిల్లా పేరును కాకినాడ జిల్లాగా మార్పు చేసుకోవాలని సూచించారు. అలాగే ఆధార్‌కు మొబైల్ నెంబర్, మెయిల్ ఐడి అనుసంధానంతో పాటు ఇతర సేవలను కూడా పొందవచ్చునన్నారు. నగరంలోని కృష్ణానగర్-2 (ఎ), డైరీఫారం-11(ఎ), గోళీలపేట-14 (ఎ), యానాం రోడ్డు-15 (ఎ), చిన్నమార్కెట్-21 (ఎ), యాళ్లవారి వీధి-28 (బి), జగన్నాథపురం-30 (బి), బ్యాంక్‌పేట -32 (ఎ), గాంధీనగర్-38(ఎ), గైగోలుపాడు-50(బి) సచివాలయాల్లో ఈ శిబిరాలు కొనసాగుతాయన్నారు.

సంత్ నిరంకారి ఆధ్వర్యంలో జలవనరుల సంరక్షణ



చెరువులోని చెత్తను తొలగించి నీటిని శుభ్రపరుస్తున్న మిషన్ సభ్యులు

కాకినాడ కల్చరల్: సంత్ నిరంకారి మిషన్ నగరశాఖ ఆధ్వర్యంలో జలవనరుల సంరక్షణ ఆదివారం నిర్వహించారు. స్థానిక బాలత్రిపుర సుందరి ఆలయం సమీపంలోని చెరువులో చెత్తను మిషన్ సభ్యులు తొలగించి శుభ్రం చేశారు. మిషన్ నగరశాఖ ప్రతినిధి కె.నగేష్ మాట్లాడుతూ మిషన్ మాతా సుదీక్షా జీ మహారాజ్ ప్రాజెక్టు అమృత్ కార్యక్రమాన్ని డిల్లీలో ఆదివారం ప్రారంభించారన్నారు. ఆమె ఆదేశాల మేరకు మిషన్ సభ్యులు ప్రతి నగరంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముందు కుళాయి చెరువు ప్రాంగణం చుట్టూ ర్యాలీ నిర్వహించారు. మిషన్ ప్రతినిధులు కె.రామకృష్ణ, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బల్లల పండగ



ఈదమ్మతల్లికి పూజలు చేస్తున్న రజకులు

కరప: రజక సామాజికవర్గం వారు ఆదివారం బల్లల పండుగ నిర్వహించారు. శివగంగ రజక సేవాసంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో కొత్తపేట, పల్లపువీధి, రామకంచిరాజునగర్ కాలనీ తదితర ప్రాంతాల్లోని రజకులు తీన్‌మార్ వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్థానిక సిపాయి చెరువు వద్ద చాకిరేవులోని బల్లల వద్ద రజకులు తమ కులదేవత ఈదమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. సంఘం గౌరవాధ్యక్షులు కాకినాడ ఈశ్వరరావు, సైనవరపు సత్యనారాయణ, సంఘ అధ్యక్షుడు మురమళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శి సైనవరపు సతీష్, కోశాధికారి మంచాల శ్రీనివాస్, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవరచుకోవాలి

కరప: ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచి పుస్తక పఠనం అలవరచుకుంటే అన్ని విషయాలపై అవగాహన పెరుగుతుందని లైబ్రేరియన్ పాట్నీడి వెంకటరంగయ్య సూచించారు. మండలం వేళంగి శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక హైస్కూలు విద్యార్థులు, గ్రామస్తులు గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేశారు.

గాంధీనగర్ గ్రంథాలయంలో..

బాలాజీచెరువు: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నగరంలో ఉన్న గ్రంథాలయాల శాఖల్లో ఆదివారం 'చదవడం మాకిష్టం' నిర్వహించారు. వి లవ్ రీడింగ్ పేరుతో సెలవు రోజుల్లో చదువుకు విరామం కలగకుండా విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై ఇష్టమైన పుస్తకాలు చదివారు. దాదాపు 100 మంది విద్యార్థులు పైగా సందర్శించగా గ్రంథాలయాధికారి ములంపాక శ్రీనివాసరావు విద్యార్థుల సందేహాలను నివృత్తిచేసి వారికి కావలసిన పుస్తకాలు అందజేశారు.

నేడు కార్పొరేషన్‌లో స్పందన

కాకినాడ: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్పందన నిర్వహిస్తున్నామని కార్పొరేషన్ కమిషనర్(ఎఫ్ఏసీ) సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. స్థానిక సమస్యలపై స్పందనకు వచ్చి ప్రజలు వినతి పత్రాలు ఇవ్వవచ్చునని చెప్పారు.

ఎస్సీ పథకాలు పునరుద్ధరించాలి

బాలాజీచెరువు: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే పథకాలు పునరుద్ధరించాలని జనసేన పార్టీ నగర ఇన్‌చార్జ్ ముత్తా శశిధర్ పేర్కొన్నారు. మన ప్రాంతం-మన సచివాలయంలో భాగంగా ఆదివారం 20 బి వార్డు ప్రాంతం సందర్శించి అక్కడ సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఆర్డర్ తప్పి.. అల్లరి చేసి..





ఆత్మీయ సమావేశంలో లఘునాటిక ప్రదర్శిస్తున్న న్యాయవాదులు, వీక్షిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాల సుబ్రహ్మణ్యం, న్యాయవాదులు

- న్యాయమూర్తుల ఎదుట న్యాయవాదుల నాటకాలు
- ఆత్మీయంగా సాగిన బార్ అసోసియేషన్ సమ్మేళనం

కాకినాడ రూరల్: మండలంలోని తిమ్మాపురం గ్రామ పరిధిలో అచ్చంపేట జంక్షన్ వద్ద మామిడి వనంలో కాకినాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమావేశం జరిగింది. న్యాయవాదులు, వారి కుటుంబ సభ్యులు సందడి చేశారు. లఘు నాటికలతో (స్కిట్) న్యాయవాదులు అదరగొట్టగా ముందు వరసలో కూర్చున్న పలువురు న్యాయమూర్తులు మనసారా నవ్వులు రువ్వుతూ ఆస్వాదించారు. బార్ అసోసియేన్ అధ్యక్షుడు ఏలూరి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి సంకు సింగ్, సభ్యులు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విందులో అంతా కలసి భోజనాలు చేస్తూ ఒకరితో ఒకరి ఆత్మీయ పలకరింపులు చేసుకున్నారు. కార్యక్రమంలో మూడో అదనపు జిల్లా జడ్జి కమలా దేవి, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి నాగేశ్వరరావు, మూడో అదనపు జడ్జి మల్లేశ్వరి, ఆరో అదనపు జిల్లా జడ్జి నిఖిత, నాలుగో అదనపు జిల్లా జడ్జి హరినారాయణ, రెండో సీనియర్ సివిల్ జడ్జి పద్మజ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు ధన్యవాదాలు తెలియజేస్తున్న రామకృష్ణ

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ బలోపేతానికి చేనేత కులస్తులు, బీసీ సంఘాలను ఏకతాటిపై తీసుకువస్తామని పార్టీ వీవర్స్ వింగ్ జిల్లా అధ్యక్షుడు పంపన రామకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని తూరంగి గ్రామానికి చెందిన రామకృష్ణ, ఆ గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఆదివారం ఎమ్మెల్యే కురసాల కన్నబాబును కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. రామకృష్ణను ఆయన సత్కరించి అభినందనలు తెలిపారు. రామకృష్ణతో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, తూరంగి మాజీ సర్పంచ్‌లు అడ్డూరి ఫణీష్‌రావు కుమార్, బలగం ప్రసన్నకుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు బొడ్డు సత్యనారాయణ, దాట్ల సరబాబు, గొల్లపల్లి సూర్యప్రకాశరావు (బాబులు), అనిశెట్టి రామకృష్ణ, మేడపాటి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీసీల ఐక్యతతో రాజ్యాధికారం



సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘాల ప్రతినిధులు

కాకినాడ సిటీ: రాజకీయాలకు అతీతంగా బీసీలందరూ ఐక్యమత్యంగా పోరాడినప్పుడే రాజ్యాధికారం సాధించవచ్చని బీసీ వెల్ఫేర్ జేఏసీ వ్యవస్థాపన అధ్యక్షుడు అంగిరేకుల ఆదిశేషు అన్నారు. ఆదివారం కాకినాడలో బీసీ వెల్ఫేర్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీల ఆత్మగౌరం, సమగ్రాభివృద్ధి అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీ సంఘాలను ఒకే వేదిక మీదకు తీసుకువచ్చి సమన్యాయం జరిగేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న కొడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ఇటువంటి సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పసుపులేటి వెంకటలక్ష్మి, కర్రి నారాయణరావు, బీసీ సంఘాల నాయకులు పెనమాల మల్లేశ్వరరావు, మేడా పరమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ధారపల్లి జలపాతం వద్ద యాత్రికుల సందడి



ధారపల్లి జలపాతం వద్ద సందడి చేస్తున్న యాత్రికులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధారపల్లి జలపాతం వద్ద ఆదివారం యాత్రికులు సందడి చేశారు. సెలవు దినం కావడంతో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ధారపల్లి జలపాతానికి భారీగా యాత్రికులు తరలివచ్చారు. కుటుంబ సభ్యులతో కలిసి జలపాతం వద్ద స్నానాలు చేసి సందడి చేశారు. జలపాతం ప్రాంగాణంలో ఆటపాటలతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. యువత కేరింతలు కొట్టారు.

కల్యాణం.. కమనీయం



తాటిపర్తిలో అపర్ణాదేవి అమ్మవారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

- కన్నులపండువగా అపర్ణాదేవి కల్యాణం
- వీక్షించి తరించిన భక్తులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసిన అపర్ణా సమేత నాగేశ్వరస్వామివారి కల్యాణోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో తొలిరోజు అపర్ణా సమేత నాగేశ్వరస్వామి దివ్య కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు కల్యాణాన్ని తిలకించారు. ఉదయం కల్యాణోత్సవాల ప్రారంభం సందర్భంగా ఆలయ అర్చకులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ఆకొండి ప్రభాకర శాస్త్రి అంకురార్పణ, ధ్వజారోహణం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక, అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం వారిని వధూవరులుగా చేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అమ్మవారి కల్యాణోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ భక్తులను అమితంగా ఆకట్టుకుంది.

ఎంపీ గీతతో జీను భేటీ



ఎంపీ గీతను కలసిన గ్రంథాలయ పరిషత్ సభ్యుడు జీను మహేష్‌బాబు

కాకినాడ: రాష్ట్ర గ్రంథాలయ సంస్థ సభ్యులు జీను మహేష్‌బాబు ఆదివారం ఎంపీ వంగా గీతను మర్యాదపూర్వకంగా కలిసారు. కాకినాడలోని ఎంపీ నివాసానికి వెళ్లి గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలని ఆమెకు విజ్ఞప్తి చేశారు.

జీనుకు ఎమ్మెల్యే కురసాల అభినందనలు

కాకినాడ రూరల్: ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ సభ్యుడు జీను మహేష్‌బాబు రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే కురసాల కన్నబాబును మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా మహేష్‌బాబును కన్నబాబు అభినందించారు. గ్రంథాలయాల్లోని పురాతన సంపదను భావి తరాలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే ఆయనకు సూచించారు. రెండేళ్ల పాటు పదవిలో కొనసాగుతానని, గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తాన్నారు.

సమితి సేవలు ఆదర్శనీయం



సమావేశంలో పాల్గొన్న డీఈఓ అన్నపూర్ణ తదితరులు

కాకినాడ కల్చరల్: శ్రీరామకృష్ణ సేవాసమితి సేవలు ఆదర్శనీయమని డీఈఓ కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ అన్నారు. స్థానిక శాంతినగర్‌లోని సమితి ఆడిటోరియంలో హెచ్ఐవీ బాధిత బాలలకు ఆదివారం పోషక ఆహారం, దుప్పట్లు పంపిణీ చేశారు. సమితి కార్యదర్శి కె.మహాలక్ష్మి, కరస్పాండెంట్ కేఎస్ఎన్ శర్మ, సభ్యులు కేఎస్‌వీ ప్రసాద్, శ్రీరామకృష్ణా పబ్లిక్ స్కూల్ హెచ్ఎం కె.అప్పారావు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రేడ్-2 వీఆర్వోలకు ప్రొబేషన్ ఇవ్వాలి

కాకినాడ సిటీ: గ్రేడ్-2 వీఆర్వోలకు సర్వే ట్రైనింగ్‌తో సంబంధం లేకుండా ప్రొబేషన్ డిక్లేర్ చేయించాలని కోరుతూ జిల్లా వీఆర్వోల సంఘం నాయకులు ఆదివారం అమరావతిలో రాష్ట్ర ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లును కలసి వినతి పత్రం అందించారు. దీనిపై బొప్పరాజు స్పందిస్తూ ఈ విషయమై ఇప్పటికే ప్రభుత్వంతో మాట్లాడామని, రానున్న చర్చల్లో మొదటి అజెండాగా పెట్టినట్లు తెలిపారు. బొప్పరాజును కలిసిన వారిలో జిల్లా వీఆర్వోల సంఘం నాయకులు సీహెచ్ చిన్న, సాయిరెడ్డి, సూరిబాబు, చిన్నారావు, రమేష్ తదితరులు ఉన్నారు.

పేకాట శిబిరంపై దాడి : ఇద్దరి అరెస్టు

కరప: మండలం కూరాడలో పేకాట శిబిరంపై ఆదివారం కరప పోలీసులు దాడిచేసి పలువురిని అరెస్టు చేశారు. కరప ఎస్ఐ ఎస్.రామకృష్ణ తెలిపిన కథనం మేరకు కూరాడలో పేకాడుతున్న వారిపై ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో కల్సి దాడిచేశారు. కొందరు పారిపోగా ఇద్దరిని అరెస్ట్‌చేశారు. వారి నుంచి రూ 1,020 నగదు, పేకలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కాకినాడ కోర్టులో హాజరుపరుస్తామని ఎస్ఐ తెలిపారు.

రూ.9,120 స్వాధీనం

కాకినాడ క్రైం: కాకినాడ గోళీలపేట మేకల కబేళా వద్ద ఓ పేకాట శిబిరంపై ఆదివారం రాత్రి పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 8 మంది పేకాడుతున్న వారిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.9,120 నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

రక్తదానంపై అవగాహన అవసరం



ఎంపీ గీతను సత్కరిస్తున్న రోటరీ గోల్డెన్ జుబ్లీక్లబ్ సభ్యులు



రక్తదాతలను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు శివప్రసన్న

- గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ ముందుకు రావడంలేదు
- ఎంపీ వంగా గీత

బోట్‌క్లబ్: రక్తదానంపై సరైన అవగాహన లేకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ దాతలు ముందుకు రావడం లేదని ఎంపీ వంగా గీత అన్నారు. స్థానిక రోటరీహాల్‌లో ఆదివారం నిర్వహించిన రోటరీ గోల్డెన్ జుబ్లీక్లబ్ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్లమెంట్ సమావేశాలు అనంతరం గ్రామీణ ప్రాంతాల్లో రోటరీ బ్లడ్‌బ్యాంకు సహకారంతో భారీ స్థాయిలో రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రక్తదానం వల్ల ప్రాణం నిలబడుతుందని యువతకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రోటరీ వృద్ధాశ్రమంలో లిఫ్ట్ ఏర్పాటు చేయడానికి ఎంపీ లాడ్స్ నిధులు, దాతల సహకారంతో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రోటరీ గోల్డెన్‌జూబ్లీక్లబ్ అధ్యక్షులు జీవీ కృష్ణ ప్రకాష్, కార్యదర్శి వడ్డాది ఆదిత్య, రోటరీ బ్లడ్‌బ్యాంకు చైర్మన్ టీవీ బాలకృష్ణ, కార్యదర్శి చార్మినార్ వర్మ, అసిస్టెంట్ గవర్నర్ చోడిశెట్టి పద్దరాజు ఆధ్వర్యంలో ఎంపీని సత్కరించి, జ్ఞాపికను అందించారు.

వి లవ్ యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కొడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి అన్నారు. స్థానిక రెడ్‌క్రాస్‌లో ఆదివారం వి లవ్ యు ఫౌండేషన్ మేనేజర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్ ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. ఫౌండేషన్ మేనేజర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఫౌండేషన్ సౌత్ కొరియాలో ప్రారంభించారని, 183 దేశాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రక్తం అవసరం ఉన్నవారు తమ ఫౌండేషన్‌ను సంప్రదించాలన్నారు. రక్త దాతలను వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న అభినందించారు. 82 మంది రక్తదానం చేసినట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు తెలిపారు.

తగిన జాగ్రత్తలతో మధుమేహం అదుపు



గురజనాపల్లిలో షుగరు, బీపీ పరీక్షలను పరిశీలిస్తున్న బాలకృష్ణ, ఇతర క్లబ్ అధ్యక్షులు

కరప: మధుమేహంపై అవగాహన కలిగి తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని లయన్స్ విశ్రాంత గవర్నర్ బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. మండలం గురజనాపల్లిలో ఆదివారం కాకినాడ స్టార్స్ లయన్స్ క్లబ్ ఏర్పాటుచేసిన మధుమేహ అవగాహన సదస్సును ఆయన ప్రారంభించి అవగాహన కల్పించారు. గురజనాపల్లి గ్రామస్తుడు, కాకినాడ మైత్రి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కర్నాసుల శివకుమార్ మాట్లాడుతూ ల్యాబ్ టెక్నిషియన్లు, లయన్స్‌క్లబ్ సభ్యులు బృందాలుగా ఏర్పడి రెండు రోజుల పాటు గ్రామంలో ఇంటింటికీ తిరిగి ఉచితంగా షుగరు, బీపీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మంగళవారం షిరిడీసాయిబాబా ఆలయం వద్దకు కాకినాడ మెడికవర్ వైద్యులను తీసుకువచ్చి వైద్యసేవలు అందించడం జరుగుతుందని, ఈఅవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ అనసూరి శ్రీనివాసరావు, గొల్లపాలెం లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ సూర్యనారాయణరాజు, జెడ్‌సీ ప్రదీప్, కాకినాడ స్టార్స్ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ సీహెచ్ గణేష్‌ప్రసాద్, కోశాధికారి నాయుడు, డీసీవీఎస్ఆర్ మూర్తి, వి.నాగిని తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తమ' వైద్యులకు కన్నబాబు అభినందన



వైద్యులు సత్యనారాయణ, పద్మావతిలను అభినందిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు, సత్యనారాయణ

కాకినాడ రూరల్: ఇండియన్ డెంటల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా పనిచేస్తూ జాతీయ స్థాయిలో ఉత్తమ అధ్యక్షులుగా పురస్కారం అందుకున్న దంత వైద్యులు అడ్డాల సత్యనారాయణ, పద్మావతిలను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదివారం అభినందించారు. ఐడీఏ కాకినాడ అధ్యక్షుడిగా పనిచేసిన డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, తరువాత ఐడీఏ అధ్యక్షురాలిగా పనిచేసిన డాక్టర్ పద్మావతికి జాతీయ స్థాయిలో పురస్కారాలు వచ్చినట్టు తెయడంతో వారిని రమణయ్యపేటలో క్యాంపు కార్యాలయానికి అభినందనలు తెలిపి సత్కరించారు. నియోజవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



డీఈవోను కలిసిన వైఎస్సార్ టీఎఫ్ నాయకులు

కాకినాడ సిటీ: డీఈఓ కేఎస్‌వీఎస్ అన్నపూర్ణను వైఎస్సార్ టీఎఫ్ నాయకులు ఆదివారం డీఈవో కార్యాలయంలో కలసి అభినందించారు. జిల్లాలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, పరిపాలనాంశాలలో తమ సంఘం తోడ్పాటు ఎప్పుడూ ఉంటుందన్నారు. డీఈవో స్పందిస్తూ తన పరిధిలో సమస్యలు పరిష్కరిస్తామని, ఇతర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతానన్నారు. వైఎస్సార్ టీఎఫ్ జిల్లా అధ్యక్షులు సక్కా వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వీరవల్లి గోపీకృష్ణ, సంఘం నాయకులు బి.శ్రీకాంత్, జి.రాధాకృష్ణ, కె రమణమూర్తి, బెన్‌జాన్సన్ తదితరులు డీఈవోను కలిసిన వారిలో ఉన్నారు.

పొద్దెక్కినా పొగమంచు పరదాలే..!



సామర్లకోటలో పొగ మంచుతో కనిపించని రహదారి

సామర్లకోట: గతంలో ఎన్నడూ లేని విధంగా ఆదివారం ఉదయం పట్టణం అంతా పొగ మంచు ముసిరేసింది. దాంతో అన్ని రహదారి కనిపించక వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 8 గంటల వరకు ఇదే పరిస్థితి. కాగా పొంగ మంచుతో మామిడి పూత దెబ్బ తింటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఫిబ్రవరి ప్రారంభం నుంచి వేసవిలా ఎండలు మండిపోతున్నాయి. ఇప్పుడే ఈ విధంగా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఎండలు ఏవిధంగా ఉంటాయోనని ప్రజలు హడలిపోతున్నారు.

కిరాణా షాపులో చోరీ

పిఠాపురం: తన కూరగాయల దుకాణంలో చోరీ జరిగినట్లు యజమాని అద్దంకి శ్రీను ఆదివారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై జగన్మోహన్ తెలిపిన వివరాల మేరకు శ్రీను ఈ నెల 22న కిరాణా షాపులో ఉదయం నుంచి అమ్మకాలు జరిపి రాత్రి దుకాణం మూసి ఇంటికి వెళ్లిపోయాడు. 23వ తేదీ ఉదయం వెళ్లి చూడగా షాపు వెనుక షట్టర్ తీసి ఉంది. దీంతో షాపు లోపలకు వెళ్లి చూడగా గల్లా పెట్టె కనిపించలేదని, దానిలో రూ.2.40 లక్షలు ఉన్నట్టు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

దేవదాయ శాఖ మంత్రికి ఆహ్వానం

తుని రూరల్: ఎస్.అన్నవరంలోని శ్రీ, భూ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద నిర్మించిన పుష్కరిణి ప్రారంభోత్సవానికి రావాలని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను ఆహ్వానించారు. దేవస్థానం చైర్మన్ కోలా భీమేశ్వరరావు, ధర్మకర్తలు ఆదివారం తాడేపల్లిగూడెం నివాసంలో మంత్రిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. శ్రీవారి పుష్కరిణిని మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రారంభిస్తారని, రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆత్మీయ అతిథిగా పాల్గొంటారని ఆలయ చైర్మన్ భీమేశ్వరరావు తెలిపారు.